హెచ్‌సీయూలో సర్కారు చేస్తున్న దమనకాండను వ్యతిరేకిస్తూ ఓయూలోని ఆర్ట్స్ కాలేజీ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నేతలు. చిత్రంలో బీఆర్ఎస్వీ నేతలు గెల్లు శ్రీనివాస్, తుంగ బాలు

హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీలో సీఎం రేవంత్ దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

భట్టి చెప్పిన వట్టి ముచ్చట

మొదటిపేజీ తరువాయి...

హయాంలో ఐఎంజీ భారత్ కంపెనీకి 400 ఎకరాలు కేటాయించడం భూ పంపకానికి పరాకాష్ట! ఇప్పుడు ఇందిరమ్మ పాలన, ఇందిరమ్మ వారసులం అని చెప్పుకొనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏకంగా ఆ 400 ఎకరాలను అమ్మకానికి పెడుతూ వర్సిటీకి ద్రోహం చేస్తున్నది.

కంచె గచ్చిబౌలిలోని 400 ఎకరాలతో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధం లేదు. ఆ భూములకు బదులు గోపనపల్లిలో 397 ఎకరాలను ఉమ్మడి రాష్ట్రంలోనే కేటాయించారు.
- మంగళ వారం మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పిన లెక్క ఇది!

వర్సిటీకి కేటాయించిన 397 ఎకరాల్లో 206 ఎకరాలను టాటా ఇనిస్టిట్యూట్ ఫర్ ఫండమెంటల్ రీసెర్చ్‌కు, 100 ఎకరాలను నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ యానిమల్ బయోటెక్నాలజీకి కాంగ్రెస్ ప్రభుత్వమే కట్టబెట్టింది. అంటే యూనివర్సిటీకి దక్కింది 91 ఎకరాలు మాత్రమే! అంటే పావు వంతు కూడా దక్కలేదు.
- మీడియాకు చెప్పకుండా భట్టి దాచిన సత్యమిది!

ఇదీ అసలు కథ!

1969లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్నకాలం. నాడు కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, ఉద్యమాన్ని అణచివేసేందుకు అనేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా నాటి ప్రధాని ఇందిరాగాంధీ స్వయంగా హైదరాబాద్‌కు వచ్చారు. తెలంగాణ ప్రాంతానికి సెంట్రల్ యూనివర్సిటీని కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. కంచె గచ్చిబౌలిలో 2,253 ఎకరాల భూమిని కేటాయించారు. ఈ భూమిని ఎలాంటి వాణిజ్య ప్రయోజనాల కోసం ఉపయోగించవద్దని, కేవలం ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కోసమే వినియోగించాలని స్పష్టమైన షరతు విధించారు. కానీ, హెచ్‌సీయూకు ఇప్పటివరకు గుంట భూమి ఉన్నట్టుగా హక్కుపత్రం లేదు. దీంతో ప్రభుత్వాలు వర్సిటీ భూములను పప్పు బెల్లాల్లా పంచిపెట్టడం మొదలుపెట్టాయి. 2003లో చంద్రబాబు సర్కారు వర్సిటీకి చెందిన 400 ఎకరాల స్థలాన్ని ఐఎంజీ భారత్ అనే కంపెనీకి కేటాయించింది. ఆ సమయంలో 400 ఎకరాలకు బదులుగా 537 ఎకరాలిస్తామని చెప్పింది. కానీ గోపన్‌పల్లిలో 397 ఎకరాలనే వర్సిటీకి ఇచ్చింది. మిగతా 140 ఎకరాల స్థలాన్ని ఇవ్వలేదు. ఇచ్చిన 397 ఎకరాల్లోనూ నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఆదేశాల మేరకు టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (టీఐఎఫ్ఆర్)కు 206 ఎకరాలు కేటాయించారు. ఆ తర్వాత నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ యానిమల్ బయోటెక్నాలజీ (ఎన్ఐఏబీ)కి మరో 100 ఎకరాల స్థలాన్నిచ్చారు. అంటే పరిహారంగా ఇవ్వాల్సిన 140 ఎకరాలను ఇవ్వకపోగా, టీఐఎఫ్ఆర్, ఎన్ఐఏబీల కోసం 306 ఎకరాలు తీసుకున్నారు. అంటే యూనివర్సిటీ 446 ఎకరాలు కోల్పోయింది. కాబట్టి కోర్టు ఆదేశాలతో వచ్చిన 400 ఎకరాలు యూనివర్సిటీకి ఇస్తే నష్టం భర్తీ అయ్యేది. కాంగ్రెస్ ప్రభుత్వం వేలంలో అమ్మేస్తే వర్సిటీకి గుంట భూమి రాకపోగా 46 ఎకరాలను అదనంగా నష్టపోయినట్టవుతుంది. వర్సిటీ ఏర్పడిన నాటి నుంచి సుమారు 70 ఏండ్లలో అత్యధిక కాలం పాలించింది కాంగ్రెస్ నేతలే కదా? ఇన్నాళ్లుగా వర్సిటీ పేరిట గుంట భూమిని కూడా ఎందుకు రిజిస్ట్రేషన్ చేయలేదు? అని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. కాబట్టి ప్రభుత్వం వెంటనే 400 ఎకరాలను యూనివర్సిటీకి అప్పజెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

మీరే పెయిడ్ బ్యాచ్..

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): హెచ్‌సీయూ భూముల విషయంలో మంత్రి పొంగులేటి మంగళవారం మాట్లాడుతూ 'విద్యార్థుల ముసుగులో బయటవారి అరాచకం' అంటూ చేసిన వ్యాఖ్యలపై విద్యార్థులు భగ్గుమన్నారు. పొంగులేటి చెప్పే 'పెయిడ్ బ్యాచ్' పదాలు ఎన్ఎస్‌యూఐకి కూడా వర్తిస్తాయా? అంటూ వేణు అనే విద్యార్థి ఘాటుగా స్పందించారు. కాంగ్రెస్ సీఎం, మంత్రులు పెయిడ్ బ్యాచ్‌లా పనిచేస్తున్నారని మండిపడ్డారు.

హెచ్‌సీయూ విద్యార్థులు అడుగుతున్న ప్రశ్నలివి!

- తీసుకున్న భూమికి పరిహారంగా 397 ఎకరాల భూమిని వాపస్ ఇవ్వనప్పుడు.. అసలు 400 ఎకరాల భూమిని తీసుకోవడమనేదే చెల్లదు! కాబట్టి భట్టి చెప్పిన లెక్క ప్రకారం ఆ 400 ఎకరాలు వర్సిటీవే అవుతాయి!
- కేవలం భూ బదలాయింపునకు సంబంధించి సంతకాలు చూపిస్తే సరిపోదు. ఇచ్చిన భూమి ఎక్కడ ఉన్నదనేది చూపించాలి.
- ఒకవేళ పత్రాలే ప్రామాణికమైతే 1974లో ఏర్పడిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి.. దశాబ్దాల పాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎలాంటి భూ యాజమాన్య హక్కులను కల్పిస్తూ సాధికార పత్రాలు ఇవ్వలేదు! మరి పత్రాలు లేనంత మాత్రాన ఇప్పుడా భూమి వర్సిటీది కాదంటరా? దాన్ని కూడా అమ్మకానికి పెడుతరా? భట్టిగారు గతంలోనే ప్రభుత్వం ఇచ్చిందని చెప్తున్న 397 ఎకరాల భూమి ఇప్పుడు వర్సిటీ ఆధీనంలోనే ఉన్నదని నిరూపించగలరా? కనీసం దాని హద్దు లేమిటో చూపగలరా?
- యూనివర్సిటీకి ఒక వేళ హక్కుపత్రాలు లేకపోతే..ప్రభుత్వమే పత్రాలు ఇచ్చి హక్కులు కల్పించాలి.
- కానీ, చెల్లని కాగితాలను చూపించి భూములు మావే అంటే ఎట్లా? ఇది ఒక ప్రభుత్వం వ్యవహరించాల్సిన తీరేనా?
- సాధారణంగా పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వాలు కొట్లాడాలి. లేదా కొట్లాడుతున్న వాళ్లను ప్రోత్సహించాలి.
- కానీ, ప్రభుత్వమే ప్రర్యావరణ విధ్వంసానికి పాల్పడుతూ.. పర్యావరణ పరిరక్షణ కోసం కొట్లాడుతున్న విద్యార్థులపై కేసులు పెట్టడం ఏమిటి? నిన్న మూసీ, హైడ్రా చర్యలు, ఇప్పుడు హెచ్‌సీయూ వ్యవహారంతో ఈ ప్రభుత్వానికి పర్యావరణ పరిరక్షణపై చిత్తశుద్ధి లేదన్న విషయం తేలిపోయింది.
- అటు 397 ఎకరాలు ఇవ్వకుండా.. ఇటు 400 ఎకరాలపై హక్కే లేదంటే యూనివర్సిటీకి ఇందిరాగాంధీ హయాంలో ఇచ్చిన భూములు ఎటు పోయినట్టు?

..వీటన్నింటికీ హెచ్‌సీయూ పూర్వ విద్యార్థుల మని చెప్పకొనే భట్టి విక్రమార్క, దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఏం సమాధానం చెప్తరు?

పేదల ఇండ్లు.. పక్షుల గూళ్లనూ వదలరా?

- **నోరున్న జనం.. నోరులేని జీవాలపైకి బుల్డోజర్**
- **మూసీలో మూటలు.. హెచ్‌సీయూలో కాసుల వేట**
- **ఇందిరమ్మ రాజ్యంలో అప్రకటిత ఎమర్జెన్సీ**
- **రేవంత్ సర్కారుపై నిప్పులు చెరిగిన కేటీఆర్**

హైదరాబాద్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ) : హైడ్రా, మూసీ పేరుతో పేదల ఇండ్లను, హెచ్‌సీయూలో పక్షుల గూళ్లను సైతం రేవంత్ సర్కారు వలిపెట్టడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. 'నోరున్న జనంపైకి బుల్డోజర్.. నోరు లేని జీవాల మీదికీ బుల్డోజర్' అంటూ మంగళవారం ఎక్స్ వేదికగా నిప్పులు చెరిగారు. వర్సిటీ భూములను సర్కారు చర్యలను ఖండిస్తూ 'మూసీ, హైడ్రాలో మూటల వేట–ఆఖరికి హెచ్‌సీయూలోనూ కాసుల వేట! నీళ్లు లేక పంటలు ఎండుతూ రైతుల గోస – అర్ధరాత్రి బుల్డోజర్ల దెబ్బలకు వన్యప్రాణాల హాహా కారాలు! చదువుల చెప్పే చోట విధ్వంసం – విలువగల భూములపై వికృత క్రీడ!' అంటూ కవితాత్మకంగా విమర్శలు గుప్పించారు. 'ప్రజలను పాలించే నాయకుడివా?–భూములు చెరబట్టే రియల్ ఎస్టేట్ బ్రోకర్‌వా?' అంటూ సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి ప్రశ్నించారు. 'నాడు ఫుట్‌బాల్‌తో నీకు ఆటవిడుపు–ఇప్పుడు మూగజీవాల ప్రాణాలు, భావి భారత విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలా?' అని నిలదీశారు. 'ఇది ప్రజాపాలన కాదు.. ప్రజలను హింసించే పాలన.. ఇది అప్రకటిత ఎమర్జెన్సీ అమలులో ఉన్న ఇందిరమ్మ రాజ్యం' అంటూ నిప్పులు చెరిగారు. 'జాగో.. తెలంగాణ జాగో!' అని పిలుపునిచ్చారు.

రాహుల్‌జీ.. ద్వంద్వ విధానాలెందుకు?

కాంగ్రెస్ ప్రభుత్వం ద్వంద్వ విధానాలు పాటిస్తున్నదని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసీఆర్ హయాంలో హెచ్‌సీయూలో అమరుడైన రోహిత్ వేములకు న్యాయం కోసం రాహుల్ ఆందోళన చేశారని తెలిపారు. కానీ, ఇప్పుడు కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలో ఉన్నదని, తమను హెచ్‌సీయూరి వెళ్లకుండా అడ్డుకుంటున్నదని విమర్శించారు. తాను బయటకు వెళ్లకుండా ఇంటి వద్ద మోహరించిన పోలీసు బలగాల వీడియోను కేటీఆర్ ఎక్స్ వేదికగా మంగళవారం షేర్ చేశారు. ఎందుకు కపటనాటకాలు, ద్వంద్వ వైఖరి రాహుల్‌జీ అని నిలదీశారు.

కేబీఆర్ పార్కువద్ద బీఆర్ఎస్వీ చేపట్టిన ప్రదర్శనలో పాల్గొన్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

హెచ్‌సీయూ దమనకాండను ఆపాలి

- **బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో కేబీఆర్ పార్కు వద్ద ప్రదర్శన**
- **పాల్గొన్న మాజీ మంత్రి ఎర్రబెల్లి, సంగీత దర్శకుడు మణిశర్మ**

బంజారాహిల్స్, ఏప్రిల్ 1 : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న దమనకాండను నిరసిస్తూ బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో మంగళవారం బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. 'హెచ్‌సీయూ భూముల్లోని అటవీ సంపదను నరికివేస్తే హైదరాబాద్ ఊపిరి ఆగుతుంది' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. 'హెచ్‌సీయూ భూములను కాపాడాలి, జీవ వైవిధ్యాన్ని రక్షించాలి' అని బీఆర్ఎస్వీ నాయకులు నినదించారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి, ప్రముఖ సినీ సంగీత దర్శకుడు మణిశర్మతోపాటు పలువురు వాకర్లు ప్రదర్శనలో పాల్గొన్నారు.

కేబీఆర్ పార్కు ఎదుట నిరసన ప్రదర్శనలో పాల్గొన్న సంగీత దర్శకుడు మణిశర్మ

హెచ్‌సీయూపై ప్రచారాన్ని ఆపించండి!

- **ప్రముఖుల ట్వీట్లు నిలువరించండి**
- **నేతలకు సీఎం రేవంత్ వేడుకోలు!**
- **ఏది ముట్టుకున్నా అగ్గి అవుతున్నదని రేవంత్ అసహనం**
- **చేసేదే తప్ప! ప్రచారాన్ని ఎలా నిలువరిస్తామని నేతల రుసరుస**

హైదరాబాద్, ఏప్రిల్ 1(నమస్తే తెలంగాణ) : సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం ఉదయం సినీ పరిశ్రమకు చెందిన.. ప్రభుత్వానికి దగ్గరగా ఉన్న ఓ ప్రముఖ వ్యక్తికి ఫోన్ చేశారు. 'ఏం దన్నా.. హెచ్‌సీయూ భూముల విషయంపై మీ వాళ్లంతా వ్యతిరేకంగా ట్వీట్లు చేస్తున్నరు. మీరేం చేస్తున్నరు? జర వాళ్లను ట్వీట్లు చేయకుండా ఆపండి' అంటూ కోరినట్టు తెలిసింది. దీంతో పాటు దేశవ్యాప్తంగా వివిధ రంగాల ప్రముఖులు సైతం హెచ్‌సీయూ ఘటనను ఖండిస్తూ ట్వీట్లు చేస్తున్నారు. దీనిపైనా సీఎం రేవంత్‌రెడ్డి మరో కీలక నేతకు సూచించినట్టు సమాచారం. 'జర వాళ్లతో మాట్లాడి ఆ ట్వీట్లు తీసేయిమనండి. ఆ వ్యతిరేక ప్రచారాన్ని ఆపించండి' అంటూ వేడుకున్నట్టు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. 'సేవ్ హెచ్‌సీయూ.. సేవ్ ఎన్విరాన్‌మెంట్' అంటూ విద్యార్థుల పోరాటానికి సినీ, పారిశ్రామిక, మీడియా వర్గాల ప్రముఖులు ట్వీట్లు చేస్తున్నారు. ఈ ట్వీట్ల దాడితో రేవంత్ సర్కారు కలవర పడుతున్నది. ఓవైపు విద్యార్థుల నిరసన.. మరోవైపు ప్రముఖుల ట్వీట్లతో ప్రజల్లోనూ సర్కారుపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఈ క్రమంలో నష్ట నివారణ చర్యల్లో భాగంగా సీఎం మంగళవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంత్రులతో సమీక్ష నిర్వహించారు. ఓ సినీ ప్రముఖుడికి ఫోన్ చేసి 'మీ వాళ్లంతా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ట్వీట్లు చేస్తుంటే మీరేం చేస్తున్నారు? వాళ్లతో మాట్లాడి ఆపలేరా?' అంటూ కోరినట్టుగా తెలిసింది. సదరు సినీ ప్రముఖుడు సైతం తన సన్నిహితుల వద్ద ఆవేదన వెళ్లగక్కినట్టు సమాచారం. 'ప్రభుత్వం చేసేదే తప్పు పని. అయినా వాళ్లందరికీ నేనే మైనా బాసునా? నేను చెప్తే వినడానికి! ఏదో ఓ స్థాయిలో ఉన్నాం అంతే! అంతదానికే మనం చెప్తే వింటారనుకుంటే ఎట్ల? అయినా ప్రభుత్వం చేస్తున్న తప్పుడు పనిని వ్యతిరేకించకుండా ఎట్లా ఉంటాం? ఇది భవిష్యత్తు తరాలకు సంబంధించిన విషయం' అంటూ సదరు కీలక వ్యక్తి తన మనసులోని మాటను కుండబద్దలు కొట్టినట్టుగా తెలిసింది.

నేనేం ముట్టుకున్నా.. అగ్గవుతున్నది!

ఇక మంత్రులతో సమావేశం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి పలు కీలక వ్యాఖ్యలు చేసినట్టు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. 'ఏం దన్నా.. నేను ఏది ముట్టుకున్నా.. అగ్గయి భగ్గుమంటున్నది. ఎందుకిట్లా అయితున్నది?' అంటూ వాపోయినట్టు తెలిసింది. రేవంత్ సర్కారు తీసుకుంటున్న పలు ప్రజావ్యతిరేక నిర్ణయాలతో ప్రజల్లో తీవ్ర అసహనం వ్యక్తమవుతున్న విషయం తెలిసిందే. లగచర్లలో గిరిజనుల భూముల సేకరణ, మూసీ, హైడ్రా కూల్చివేతలు, వ్యవసాయ యూనివర్సిటీల భూముల సేకరణ, ఇప్పుడు హెచ్‌సీయూ భూముల సేకరణ ఇలా ప్రతి అంశంలోనూ సర్కారుకు ఎదురుదెబ్బలు తగులుతూనే ఉన్నాయి. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి అసహనానికి గురైనట్టు సమాచారం.

'హెచ్‌సీయూ'పై సీఎం ఉలికిపాటు

- **వెంటనే మంత్రులతో సమావేశం**
- **నష్టనివారణపై సమాలోచన**
- **ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనతో మంత్రుల ప్రెస్‌మీట్**

హైదరాబాద్, ఏప్రిల్ 1(నమస్తే తెలంగాణ): హెచ్‌సీయూ భూముల విషయంలో ప్రభుత్వ చర్యలపై అన్ని వైపుల నుంచీ తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతుండడంతో సీఎం రేవంత్‌రెడ్డి ఉలిక్కిపడ్డట్టు తెలిసింది. ఇందులో భాగంగానే నష్టనివారణ చర్యలకు దిగారు. మంగళవారం ఉదయం హుటాహుటిన మంత్రులతో సమావేశం నిర్వహించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క తదితరులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం.. వస్తున్న వ్యతిరేకతపై సుదీర్ఘంగా చర్చించినట్టు తెలిసింది. ప్రతిపక్షాల విమర్శలను ఎలా తిప్పికొట్టాలి? వివిధ వర్గాల ప్రముఖులను ఎలా సముదాయించాలనే అంశంపై చర్చ జరిగినట్టు సమాచారం. ఈ సందర్భంగా ప్రభుత్వ చర్యలపై మంత్రుల నుంచే భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనట్టు తెలిసింది. ఒకేసారి పదుల సంఖ్యలో బుల్డోజర్లను పంపడం పొరపాటని, ముందుగా విద్యార్థులు, యూనివర్సిటీ అధికారులతో సంప్రదింపులు జరిపి ఉండాల్సిందని మంత్రులు చెప్పినట్టు సమాచారం. దీనిపై దూకుడు తగ్గించాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఇందులో భాగంగానే ప్రతిపక్షాల ఆరోపణలపై హెచ్‌సీయూ పూర్వ విద్యార్థులైన భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు ద్వారా సమాధానాలు చెప్పించాలని సీఎం కోరినట్టు సమాచారం. ఇందులో భాగంగానే సమీక్ష అనంతరం భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు ఇతర మంత్రులంతా కలిసి మీడియా సమావేశం నిర్వహించినట్టు స్పష్టమవుతున్నది.

రాష్ట్ర సర్కారు చర్యలను నిరసిస్తూ క్యాంపస్‌లో మంగళవారం రాత్రి కొవ్వొత్తులను వెలిగిస్తున్న హెచ్‌సీయూ విద్యార్థులు

నిరుద్యోగ జేఏసీ క్యాండిల్ ర్యాలీ భగ్నం

- **హెచ్‌సీయూకు మద్దతుగా యువత శాంతియుత ర్యాలీ**
- **అశోక్‌నగర్ చౌరస్తా వద్ద అదుపులోకి తీసుకున్న పోలీసులు**

చిక్కడపల్లి, ఏప్రిల్ 1: హెచ్‌సీయూలో కొనసాగుతున్న దమనకాండకు వ్యతిరేకంగా నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం అశోక్ నగర్ చౌరస్తా వద్ద నిర్వహించనున్న క్యాండిల్ ర్యాలీని పోలీసులు ముందస్తుగా అడ్డుకున్నారు. హెచ్‌సీయూలో భూములను లాక్కోవడానికి చేస్తున్న ప్రయత్నంలో ఎన్నో మూగజీవులు చనిపోతున్నాయని నిరుద్యోగ జేఏసీ నాయకుడు జనార్దన్ సోషల్ మీడియాలో ఆవేదన వ్యక్తంచేశారు. సంఘీభావంగా మంగళవారం సాయంత్రం అశోక్ నగర్ చౌరస్తా వద్ద శాంతియుత క్యాండిల్ ర్యాలీని చేపడుతున్నట్టు సోషల్ మీడియా వేదిక ద్వారా అభ్యర్థులకు పిలుపునిచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు ముందస్తుగా జనార్దన్‌ను అదుపులో తీసుకున్నారు. అశోక్ నగర్ చౌరస్తా వద్ద భారీ ఎత్తున పోలీసులు మోహరించారు. విద్యార్థులు వస్తే అరెస్టు చేసి తరలించేందుకు పోలీస్ వాహనాలను ముందస్తుగానే ఏర్పాటు చేశారు.

అందరు ఒక్కటిగా.. అడవికి రక్షణగా

- **'సేవ్ హెచ్‌సీయూ' అంటూ నినదించిన ప్రముఖులు**
- **విద్యార్థుల పోరాటానికి మద్దతు**

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): మూగజీవుల రోదనలకు చలించిపోయి, పచ్చని అడివమ్మ ఒడిలో నెత్తురు పారుతుంటే చూస్తు ఊరుకోలేమంటూ.. హెచ్‌సీయూ భూములను రక్షించాలంటూ సినీ ప్రముఖులు, పర్యావరణ ప్రేమికులు, ప్రతిపక్షనేతలు ఒక్కటిగా సంఘటితమై పిడికిలి బిగించారు. హెచ్‌సీయూ విద్యార్థులు చేస్తున్న పోరాటానికి సామాజిక మాధ్యమాల్లో మద్దతు తెలుపుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో హ్యాష్‌ట్యాగ్‌తో 'సేవ్ హెచ్‌సీయూ బయోడైవర్సిటీ' అంటూ రాహుల్, ప్రియాంక, రేవంత్ రెడ్డికి ట్యాగ్ చేస్తున్నారు. 'ఎంతైనా జాతీయ పార్టీకదా.. అందుకేనేమో జాతీయ పక్షి ఉసురు తీసుకుంటుంది. జాతీయ పక్షుల ఆర్థనాదాలు వింటుంటే గుండె తరుక్కుపోతున్నది' అని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎక్స్‌లో పోస్టు చేశారు. 'ఈ విధ్వంసాన్ని మేము అంగీకరించం. విద్యార్థులు, ప్రజలు చేస్తున్న ఈ పోరాటానికి నా పూర్తి మద్దతు. ఆక్షిజన్ వేలం వేస్తున్నారు' అంటూ సినీనటుడు ప్రకాశ్‌రాజ్ ఎక్స్‌లో మండిపడ్డారు. 'ఈ చర్య ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు.. రాహుల్ వెంటనే తెలంగాణలో జరుగుతున్న విధ్వంసాన్ని ఆపాలి' అంటూ ప్రముఖ యూట్యూబర్ ధ్రువ్ రాథీ పోస్టు చేశారు. హెచ్‌సీయూ భూములను లాక్కోవాలని ప్రయత్నిస్తున్న కాంగ్రెస్ సర్కారుపై ప్రముఖ సినీ నటుడు రామ్‌చరణ్ భార్య ఉపాసన సోషల్ మీడియా వేదికగా మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ కూడా ప్రభుత్వంపై ధ్వజమెత్తారు.

జీవ వైవిధ్యానికి ఆలవాలం హెచ్‌సీయూ

అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బీ నాగేశ్వర్‌రావు

మాదాపూర్, ఏప్రిల్ 1: హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ జీవవైవిధ్యానికి, అరుదైన శిలాజ సంపదకు ఆలవాలంగా నిలుస్తున్నదని వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ బీ నాగేశ్వర్‌రావు అన్నారు. 'యూనివర్సిటీలో 700 రకాల మొక్కలు, 10 జాతుల క్షీరదాలు, 15 జాతుల సరీసృపాలు, 200 రకాల పక్షిజాతులు ఉన్నాయి. వివిధ రకాల చెట్లు, ఆయుర్వేద మెడిసిన్లకు ఉపయోగపడే మొక్కలతోపాటు రిసెర్చ్ మొక్కలు ఉన్నాయి. ప్రకృతిని నాశనం చేస్తే ఇవాళ మంచి నీళ్లను ఎలాగైతే కొంటున్నామో, ముస్ముందు ఆక్సిజన్‌ను కొనాల్సి వస్తుంది' అని ఆవేదన వ్యక్తంచేశారు.

పోలీసుల దౌర్జన్యంపై నేడు నిరసనలు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపు

హైదరాబాద్, ఏప్రిల్ 1 (నమస్తేతెలంగాణ) : హెచ్‌సీయూ భూముల వేలానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలపై పోలీసుల దౌర్జన్యాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. వేలాన్ని వ్యతిరేకిస్తున్న విద్యార్థులపై ప్రభుత్వం నిర్బంధానికి పాల్పడుతున్నదని ఆరోపించారు. యూనివర్సిటీ భూములు వర్సిటీకే చెందాలని డిమాండ్ చేస్తున్న వారిపై అక్రమ కేసులు పెట్టడం ఏంటి? అని ప్రశ్నించారు. నిర్బంధాలతో ఉద్యమాన్ని మరింత ఉధృతం అవుతుందని హెచ్చరించారు.

విద్యార్థుల అణచివేత దుర్మార్గం

మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర, ఏప్రిల్ 1 : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల పరిరక్షణ కోసం విద్యార్థులు చేస్తున్న పోరాటాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అణచివేయడం దుర్మార్గమని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హెచ్‌సీయూ భూములను కబ్జా చేసేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని ధ్వజమెత్తారు. వందల సంఖ్యలో బుల్డోజర్లు పెట్టి భూమిని చదును చేపిస్తుండడంపై మండిపడ్డారు. అడ్డొచ్చిన విద్యార్థులపై పోలీసులతో దాడి చేయించడం హేయమైన చర్య అని దుయ్యబట్టారు. హెచ్‌సీయూ పూర్వ విద్యార్థులైన భట్టి, శ్రీధర్‌బాబు ఎందుకు మాట్లాడడం లేదని నిలదీశారు.